క్లుప్తంగా

సీనియారిటీ ప్రాతిపదికన ఎంఈఓ పోస్టు ఇవ్వాలి



డీఈఓ సలీం బాషాకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ, ఏపీయూఎస్ నాయకులు

ముమ్మిడివరం: ఎంఈఓ–1 పోస్టులను కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులకే కాకుండా కంబైన్డు సీనియారిటీ ప్రాతిపదికన కేటాయించాలని పీఆర్‌టీయూ, ఏపీయూఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ముమ్మిడివరం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. డీఈఓ షేక్ సలీం బాషాకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దీపాటి సురేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ యేరుబండి సత్యనారాయణ, అప్పారి రామకృష్ణ, ఏపీయూఎస్ నాయకులు పెచ్చెటి నరేష్, గన్నవరపు అమ్మిరాజు, యేపుగంటి వెంకట పద్మనాభం, తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

తాళ్లరేవు: మండల పరిధిలోని పిల్లంక గ్రామంలో పవిత్ర గౌతమి గోదావరి తీరాన పుష్కర్ ఘాట్ వద్ద శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన కరపత్రాలను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆవిష్కరించారు. సుమారు 130 ఏళ్ల క్రితం ఆలయ దాత, అనువంశిక ధర్మకర్త భూపతిరాజు తిరుపతిరాజు నిర్మించిన ఈ ఆలయాన్ని పునర్నిర్మించేందుకు ఈ నెల 4వ తేదీ ఉదయం 8.04 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు వేద పండితులు వేలూరి కాశిబాబు తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామితోపాటు శివ పంచాయతన సహిత నవగ్రహ ఆలయం నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగి వేణు, తోలేటి శ్రీనివాసు, వేగేశ్న శ్రీనురాజు పాల్గొన్నారు.

సుబ్బాలమ్మ దేవస్థానం చైర్మన్‌గా వీరన్న

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నియమితులైన పట్టణ వైశ్య సంఘ నాయకుడు అప్పన వీరన్నకు పలు సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. పట్టణ వైశ్య సంఘం తరఫున వీరన్నకు పలువురి నాయకలు ప్రశంసించి సత్కరించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబులను స్థానిక సావరంలోని కనకదుర్గ ఆలయంలో పట్టణ వైశ్య సంఘం ప్రతనిధులు ఘనంగా సత్కరించి వీరన్న నియామకానికి కృతజ్ఞతలు తెలిపారు. వైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, ముఖ్య సలహాదారు వరదా సూరిబాబు, సంఘ ప్రతినిధులు నంబూరి నరేష్, కొమ్మూరి వేంకటాచల ప్రసాద్ తదితరులు వీరన్నను అభినందించారు.

పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష

ఐ.పోలవరం: గోదావరి పుష్కరాల సమయం దగ్గర పడుతోందని, ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ఆదేశించారు. రాబోయే గోదావరి పుష్కరాలు పురస్కరించుకుని పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నియోజకవర్గం పరిధిలో కుండలేశ్వరం, మురమళ్ల, గేదెలంక పుష్కర ఘాట్లకు భక్తులు అధిక సంఖ్యలో వస్తారని దానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. పలు అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దేవాదాయ, పంచాయతీరాజ్, హెడ్‌వర్క్స్ విద్యుత్, రోడ్లు భవనాలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ఐ పోలవరం: మురమళ్లలో కొలువైన వీరేశ్వర స్వామి అన్నదాన ట్రస్ట్‌కు శుక్రవారం రాత్రి భక్తుడు తిరుపతికి చెందిన దాసరాజు సుధాకర్ రూ.10వేలు విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతకు స్వామి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందించి ఘనంగా సత్కరించారు. కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయులకు నియామక ఉత్తర్వులు

యానాం: వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో గెస్ట్ ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లను (లాంగ్వేజెస్) నియమిస్తూ శుక్రవారం పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎస్‌పీ జయరాజ్ ఆదేశాలు జారీచేశారు. 2025–26 విద్యా సంవత్సరానికి వీరికి నెలకు రూ.30వేల వేతనం ఆగస్టు 1, 2025 నుంచి మార్చి 31, 2026 వరకు చెల్లించనున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. యానాం నుంచి బిరుదా మాధవి, సత్యవేణి అరదాడి, విజయలక్ష్మీ పువ్వల, వీరవేణి మల్లిపూడి, సంగాని పురుషోత్తం, శీలం ప్రసాద్, దంగేటి సుధారాణి, హరికుమార్ పి, కె షహీనాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయ కొరత సమస్యను తెలిపిన వెంటనే నియామకాలకు అనుమతించిన విద్యాశాఖ మంత్రి నమశ్శివాయంకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

మోసపూరిత హామీలతో కూటమికి అధికారం

అల్లవరం: సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తామంటూ మాయ మాటలతో ఎన్నికల హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు అండ్ కో ప్రభుత్వం నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు పథకాలు అమలు చేయకుండా నిలువునా మోసం చేశారని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ నాలుగో రోజు కార్యక్రమం తూర్పులంక, రెల్లుగడ్డ, అల్లవరంలో శుక్రవారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రజల ముందుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి పెద్ద పీట వేశారన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో అంతా కాపీ పథకాలేనని, పేర్లు మార్చి అరకొరగా పథకాలు అందించడమే తప్ప ఏదీ పూర్తిస్థాయిలో అమలుచేసిన దాఖలాల్లేవన్నారు. చంద్రబాబుని నమ్మిన ప్రతిసారీ రాష్ట్ర ప్రజలు మోసపోతున్నారని ఎమ్మెల్సీ అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను మాట్లాడుతూ కూటమి నాయకులు ప్రజలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల ఊసెత్తడం లేదని ఎద్దేవా చేశారు.అనంతరం బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, రాష్ట్ర నాయకులు నాతి శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి నరసింహరావు, గ్రామకమిటీ అధ్యక్షులు గెద్దాడ సింహాద్రి, కాశే సత్యనారయణ, వాసంశెట్టి శ్రీను, పార్టీ నాయకులు ఐవీ సత్యనారాయణ, కట్టా నరేష్, యలమంచిలి శ్రీను, కడలి ఆశోక్, కంపాని రాజేష్, బొంతు నాగరాజు, ఆకుమర్తి అమృతరావు, దేవరపల్లి నరేష్, గోసంగి వెంకటేశ్వరరావు, తాడి సుమంత్, కుంచే శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తూర్పులంకలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే

ఉప్పలగుప్తం: ప్రతి ఎన్నికల ముందు హామీలిచ్చి అధికారం చేపట్టాక ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి అలవాటేనని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని చినగాడవిల్లి, పెదగాడవిల్లి, మనిపల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. క్యూఆర్ కోడ్‌తో ఉన్న బ్రోచర్లను అందించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు, సర్పంచ్‌లు యర్రంశెట్టి రామచంద్రరావు, గుద్దటి మహాలక్ష్మి, కడిమి చిన్నవరాజు, జొన్నాడ శ్రీదుర్గ, ఎంపీటీసీ సభ్యులు పెట్టా అప్పారావు, కొంకి ఏడుకొండలు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజాకుమారి, పార్టీ జిల్లా కార్యదర్శులు బడుగు మేరీకుమారి, పొగాకు శ్రీను, నిమ్మకాయల హనుమంతు శ్రీనువాసరావు, మండలం యువజన విభాగం అధ్యక్షుడు ఓగూరి విజయ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజు, గ్రామ కమిటీల అధ్యక్షులు గుద్దటి నాగరాజు, కామిశెట్టి ఏసు, పార్టీ నాయకులు పెయ్యిల కొండబాబు, మచ్చా లోవరాజు, సాదే ఆంజనేయులు, బద్రి దొరబాబు, కాట్రు కృష్ణ, కుంచే స్వామి, సలాది సతీష్, నిమ్మకాయల దుర్గారావు, బద్రి వెంకటేశ్వరరావు, గెద్దం కిరణ్‌కుమార్,బద్రి శివ, నల్లా నాయుడు, నల్లా ప్రకాష్, గుత్తుల సూర్య, ఆకుల చిన్నీ పాల్గొన్నారు.



చినగాడవిల్లిలో క్యూఆర్ కోడ్‌తో ఉన్న బ్రోచర్‌ను మహిళకు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



గుత్తినదీవిలో క్యూఆర్ కోడ్ పోస్టర్లతో నాయకులు, కార్యకర్తలు

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించిన నాయకులు

ఐ.పోలవరం: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రజలను వంచించారని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు ఆరోపించారు. చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్ సీపీ బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనిని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఐ.పోలవరం మండలం పరిధిలో శుక్రవారం పలు గ్రామాల్లో పిన్నమరాజు అధ్యక్షతన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలో గోగుల్లంక, జి.వేమవరం, గుత్తినదీవిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, పార్టీ నాయకులు, పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గ పరిశీలకుడు మాతా మురళీ, ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, ఎంపీటీసీ జ్యోతి, కాటం సత్యరాజు, భైరవస్వామి, గ్రామ కన్వీనర్లు, వార్డు కన్వీనర్లు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ అనంతరం చికిత్స ప్రారంభించాలి



అమలాపురం అర్బన్ హెల్త్ సెంటరులో తనిఖీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్: వివిధ పరీక్షలతో ప్రాథమికంగా వ్యాధి నిర్ధారణ తర్వాతే రోగికి చికిత్స అందించాలని ప్రభుత్వ వైద్యులకు, ల్యాబ్ టెక్నీషియన్లకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. అమలాపురం పట్టణం ఆర్‌డబ్ల్యూఎస్ కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆరోగ్య కార్మికులతో కలెక్టర్ మాట్లాడారు. రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలోని డ్రగ్ స్టోర్, ల్యాబ్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆస్పత్రికి సరఫరా అయ్యే మందులను ఆయన ఆన్‌లైన్ ద్వారా పరిశీలించారు.వైద్యులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆ కాలనీలో నిర్మించిన నూతన అర్బన్ హెల్త్ సెంటరు భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ భవనంలో మిగిలిన పనులను ఈనెల 15లోగా పూర్తి చేయాలని మున్సిపల్ డీఈఈ కె.సత్యనారాయణను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ ఎం ఎం.మణిదీప్ ఆస్పత్రి ల్యాబ్‌లు, డ్రగ్స్ స్టోర్, వైద్య సేవలు, డైలీ ఓపీ వంటి వివరాలను కలెక్టర్‌కు చెప్పారు. డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం. దుర్గారావు దొర, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, తహసీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్ కలెక్టర్‌కు ఆస్పత్రికి సంబంధించిన సమాచారాన్ని వివరించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీకామాక్షీ పీఠం, చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో వేర్వేరుగా మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పీఠం ఉత్తరాధికారి విఘునస రాఖీ ప్రేమ్ ఆధ్వర్యంలో మహిళలు అమ్మవార్లను కొలుస్తూ వ్రతమాచరించారు. ఈ కార్యక్రమంలో పీఠం ప్రేమ మందిరం అమ్మ వక్కలంక వాణి, పీఠం మేనేజర్ మర్రి దుర్గారావు పాల్గొన్నారు. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను గౌర్తి వెంకటకృష్ణ సత్యసాయి ఆధ్వర్యంలో మహిళలు ఆచరించారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షురాలు భమిడిపాటి శ్రీలక్ష్మి, దేవస్థానం ట్రస్టీలు కూచిమంచి నాగమణి, సుజాత, సంధ్యారాణి, ఏలూరిపాటి సరోజ, పుత్సా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యానాం అభివృద్ధికి కృషి

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ సమస్యలపై శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ముఖ్యంగా పింఛన్లు, రేషన్‌కార్డులు, ఆయా గ్రామాల్లో రహదారుల నిర్మాణం, రోగులకు చికిత్స, ఉపాధికల్పన తదితర సమస్యలను ఎమ్మెల్యే అశోక్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటిని అధిగమించి యానాం నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న యానాం ఎమ్మెల్యే అశోక్

గురుకులాల్లో ఉపాధ్యాయుల కొరత



బాలికల గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న దళిత ఐక్య వేదిక ప్రతినిధులు

అల్లవరం: గోడిలోని బీఆర్ అంబేడ్కర్ బాలుర, బాలిక గురుకులాల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు డీబీ లోక్ అన్నారు. గోడిలోని బాలుర, బాలిక గురుకులాలను జిల్లా దళిత వేదిక, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం, దళిత మహిళా శక్తి సంఘాల నాయకులు శుక్రవారం సందర్శించారు. బాలురు గురుకులంలో 24 మందికి 8 మంది, బాలిక గురుకులంలో 24 మందికి ముగ్గురు మాత్రమే శాశ్వత ఉపాధ్యాయులున్నారని మిగిలిన వారందరూ కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్నారని పేర్కొన్నారు. రెండు గురుకులాల్లో ప్రిన్సిపాల్స్ లేకపోవడం పర్యవేక్షణ లోపించిందన్నారు. ఇప్పటికీ చాలా మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదని తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణ బాగోలేదని, ఇటీవల ఇద్దరు పారిశుధ్య కార్మికులను తొలగించడంతో గురుకులాల్లో పారిశుధ్యం లోపించిందని లోక్ అన్నారు. ఫ్యాన్లు తిరగక, లైట్లు వెలగక, దోమల బెడదతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి గురుకులాల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, డీబీఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్: కాపు ఉద్యోగ సేవా సమితి (కేయూఎస్‌ఎస్) జిల్లా శాఖ ప్రతిభ కలిగిన పేద కాపు విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ నిమిత్తం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. విద్యార్థులతో సమితి ప్రతినిధులు గూగుల్ ఫాం నింపి సబ్మిట్ చేసేలా చూడాలని సేవా సమితి కోరింది. స్క్రూటినీ కమిటీ ఎంపిక చేసిన విద్యార్థులు ఫిజికల్ అప్లికేషన్‌ను సమర్పించాలని సమితి సూచించింది. ఉపకార వేతనాల పంపిణీ తేదీ, వేదిక త్వరలో తెలియజేస్తామన్నారు. ఉపకార వేతనాలను అందజేసేందుకు ఆసక్తి ఉన్న దాతలను ఆహ్వానిస్తున్నట్టు కేయూఎస్ఎస్ బాధ్యులు తెలిపారు.

భగవద్గీత శ్లోక పఠనంపై పోటీ

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం ఇస్కాన్ కేంద్రానికి చెందిన అమలాపురం రూరల్ మండలం జనుపల్లి అవుట్ పోస్ట్ సెంటరు ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా పట్టణంలోని వివిధ విద్యాలయాలకు చెందిన చిన్నారులకు భగవద్గీత శ్లోక పఠనం, డ్రాయింగ్‌పై శుక్రవారం పోటీ నిర్వహించారు. స్థానిక విద్యానిధి పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలతో పాటు ఫ్యాన్సీ డ్రెస్‌లు, డ్రాయింగ్ తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ఈనెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు అమలాపురంలో ప్రారంభమయ్యే ఇస్కాన్ నూతన మందిరంలో ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేస్తామని ఇస్కాన్ మేనేజర్ శివానంద నిమయి దాస్ తెలిపారు. ఇస్కాన్ ప్రతినిధులు శ్యామ్, సత్య ధర్మ దాస్, భక్త మురళీ తదితరులు ఈ పోటీ పరీక్షలను పర్యవేక్షించారు.

నిస్వార్థ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

యానాం: నిస్వార్థ సేవల ద్వారా ఉద్యోగులకు ప్రజాగుర్తింపు లభిస్తుందని, యానాం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో 34 ఏళ్లపాటు సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన సబ్బతి తాతారావు సేవలు ప్రశంసనీయమైనవని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం ఉద్యోగవిరమణ చేసిన తాతారావును దరియాలతిప్ప గ్రామస్తులు, పీడబ్ల్యూడీ సిబ్బంది దుశ్శాలువాతో సత్కరించారు. రిటైర్డ్ ఆర్‌ఏఓ నామాడి అప్పారావు, సివిల్స్ రైట్స్ అధ్యక్షుడు పానుగుమట్ల విష్ణుమూర్తి, కొల్లు నూకాంబరం పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

తాళ్లరేవు: కాపులపాలెంలో నూతనంగా నిర్మించిన ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవస్థానం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ చైర్మన్‌గా మాజీ సర్పంచ్ మోపూరి శ్రీనివాస కిరణ్, వైస్ చైర్మన్‌గా నందికోళ్ల సతీష్, కార్యదర్శిగా బొంతు శ్రీనివాస్, ఉపకార్యదర్శిగా నరహరిశెట్టి వీరన్న, కోశాధికారిగా దుర్గాపు వీరవెంకటసత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేసారు. తోట నారాయణరావు, పెన్నాడ బాబూరావు, వడ్డి ఏడుకొండలు, కేసనకుర్తి శ్రీనివాసరావు, నేదునూరి బాబులు, పితాని పోతురాజు కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసారు. ఆలయ అర్చకుడు ఉండు రామకృష్ణ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యవర్గ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. కాపులపాలెంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో మినీ కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తామని మోపూరి శ్రీనివాస కిరణ్ ప్రకటించారు.

హోంగార్డుల ఎంపిక జాబితా విడుదల

యానాం: మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకు హోంగార్డుల ఎంపిక జాబితాను శుక్రవారం విడుదల చేశారు. పుదుచ్చేరి పోలీస్‌శాఖ 2023లో హోంగార్డుల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసింది. 2024 జూన్ 30న రాతపరీక్షను నిర్వహించారు. రాతపరీక్షలో నోటిఫికేషన్‌లో సూచించిన సిలబస్‌కు సంబంధంలేని 15 ప్రశ్నలు ఇచ్చారని పేర్కొంటూ కొంతమంది అభ్యర్థులు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు విచారణ నిర్వహించి రాతపరీక్షలో 86వ ప్రశ్న నుంచి 100వ ప్రశ్న వరకు రాసిన అభ్యర్థులందరికీ 15మార్కులు ఇవ్వాలని, మొదటి 85 ప్రశ్నలకు పొందిన మార్కులకు జోడించి కొత్త మెరిట్ జాబితాను విడుదలచేసి అర్హత సాధించిన వారికి నియామక ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించింది. నాలుగు రీజియన్లలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను శుక్రవారం అధికారులు విడుదల చేశారు. యానాం నుంచి 25 మంది ఎంపికయ్యారు.

కలెక్టరేట్‌లో స్థల దాతల ఫిర్యాదు

అమలాపురం రూరల్: గ్రామ సచివాలయం, పశు వైద్యశాల, కుటుంబ నియంత్రణ ఉపకేంద్రం కోసం బండారులంకలో తాము దానమిచ్చిన స్థలంలో నిర్మించిన భవనాన్ని వాటికి మాత్రమే ఉపయోగించాలని వేరే ఇతర శాఖల కార్యాలయాలకు ఉపయోగించడానికి అనుమతులు ఇవ్వవద్దంటూ స్థల దాతలు బాసిన శివన్నారాయణ, బాసిన దుర్గారావు శుక్రవారం కలెక్టరేట్‌లో ఏవో కె.విశ్వేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు.

డివిజనల్ కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చినందున అటువంటి ప్రయత్నాలను నిలుపుదల చేయాలని అధికారులు కోరినట్లు స్థల దాతలు పేర్కొన్నారు.

డీఆర్వో రాజకుమారి సేవలు అభినందనీయం

అమలాపురం రూరల్: సుమారుగా 43 ఏళ్లపాటు ఎంతో ప్రాముఖ్యత కలిగిన రెవెన్యూ విభాగంలో డీఆర్వో రాజకుమారి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పలువురు మన్ననలు పొందడం అభినందనీయమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. డీఆర్వోగా పనిచేసిన రాజకుమారి పదవీ విరమణ సందర్భంగా సన్మాన సభ కలెక్టరేట్‌లో గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ డీఆర్వో రాజకుమారి సేవలు స్ఫూర్తి దాయకంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పని చేయడం గొప్ప విషయంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజకుమారిని ఆర్డీవోలు పి.శ్రీకర్ కె.మాధవి, డి.అఖిల, ఏవో కాశీ విశ్వేశ్వరరావు, రెవెన్యూ రాష్ట్ర అసోసియేషన్ చైర్మన్ వీఎస్ దివాకర్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు ఘనంగా సత్కరించారు.

కుటుంబ సభ్యులకు బాలుడి అప్పగింత

తాళ్లరేవు: ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిన 12 ఏళ్ల బాలుడు ఆచూకీని కోరంగి పోలీసులు కేవలం 6 గంటల వ్యవధిలోనే కనుగొన్నారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని జార్జీపేటకు చెందిన 12 ఏళ్ల మందపల్లి శ్రీరామ్ నీలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. కొన్నిరోజులుగా పాఠశాలకు వెళ్లడం లేదని నానమ్మ వీరమ్మ మందలించడంతో శ్రీరామ్ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బాలుడి కోసం కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో వీరమ్మ కోరంగి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు స్పందించి పలు కోణాల్లో దర్యాప్తు ప్రారంభించి ఆరు గంటల వ్యవధిలోనే కేసును ఛేదించారు. సెల్‌ఫోన్ సిగ్నల్ల ఆధారంగా బాలుడు రాజమహేంద్రవరం పరిసర ప్రాంతంలో ఉన్నట్టు గుర్తించి అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకుని కోరంగి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. కోరంగి అదనపు ఎస్సై ఎస్.సత్యనారాయణ, రైటర్ ఎన్.వెంకటరమణ సిబ్బంది సహకారంతో కేసును వేగవంతంగా దర్యాప్తు చేయగలిగామని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై, పోలీసులకు బాలుడి కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు ధన్యవాదాలు తెలిపారు.



బాలుడు శ్రీరామ్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న కోరంగి పోలీసులు

తల్లిపాలతో శిశువుకు ఆరోగ్యం

యానాం: తల్లిపాలతో శిశువుకు ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించడానికి తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీడీ రవిశంకర్, చిన్నపిల్లల స్పెషలిస్ట్ డాక్టర్ పీవీ శిరీష పాల్గొన్నారు.

ఎర్లీ బర్త్ కిట్ల పంపిణీ

అమలాపురం టౌన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నవ జాత శిశువులు, తల్లులకు శుక్రవారం ఎర్లీ బర్త్ కిట్లు పంపిణీ చేశారు. రోటరీ మాస కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆర్డీఎస్ ప్రసాద్ తెలిపారు. క్లబ్ కార్యదర్శి ఆకొండి పవన్‌కుమార్, కోశాధికారి కూచిమంచి శశిధర్ శ్రీరామ్ పాల్గొన్నారు.